బలగం
TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 30 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## తెలంగాణలో పీజీ మెడికల్ సీట్ల కుంభకోణం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పీజీ మెడికల్ సీట్ల కుంభకోణంలో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తెలంగాణలోని మెడికల్ కాలేజీయాజమాన్యాలకు భారీ షాక్ ఇచ్చారు. భారీగా మెడికల్ కాలేజీల ఆస్తులను సీజ్ చేశారు. మొత్తం రూ.9.71 కోట్ల విలువైన ఆస్తులను ఇడి అధికారులు అటాచ్ చేశారు. అందులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డికి కాలేజీకి చెందిన రూ.2.89 కోట్లను ఫ్రీజ్ చేశారు. ఎమ్ఎన్ఆర్ మెడికల్ కాలేజీకి చెందిన రూ.2.01 కోట్లను సీజ్ చేశారు. చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీకి చెందిన రూ.3.33 కోట్లను అటాచ్ చేసినట్లు శుక్రవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. మేనేజ్‌మెంట్ కోటాలో పిజి మెడికల్ సీట్లను బ్లాక్ చేసినట్లు గుర్తించారు. నీట్ పరీక్షలో టాప్ ర్యాంకర్ల సర్టిఫికెట్లతో సీట్లు బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ వరంగల్ మట్టెవాడ పిఎస్‌లో ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు ఆధారంగా ఇడి కేసు నమోదు చేసింది. గతేడాది జూన్‌లో తెలంగాణలో 16 చోట్ల ఇడి సోదాలు నిర్వహించింది. మల్లారెడ్డి కళాశాలల్లో సోదాల్లో రూ.1.04 కోట్లు నగదు స్వాధీనం చేసుకుంది.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో
## నిరుపేదలకు తొలి ప్రాధాన్యత



- ముఖ్యంగా దివ్యాంగులు, వ్యవసా య కూలీలు, సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులు ఇలా ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకోవాలి
- అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యక్రమం ఎంచుకోవాలని రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. తన నివాసంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి సీఎం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించి పలు సూచనలు చేశారు.

తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతో పాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగొద్దని ఆదేశించారు. అదే సమయంలో శాఖాపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సమర్థమంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలని.. ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు.

## లగచర్ల భూసేకరణ
# ప్రతిపాదనలు ఉపసంహారణ

- ఇండస్ట్రీయల్ కారిడార్ భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయం..!
- టెక్స్‌టైల్ కంపెనీలపై సర్కారు ఆసక్తి..!




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫార్మా పరిశ్రమల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లగచంర్లతో పాటు హకీంపేట, పోలేపల్లిలో ఫార్మా విలేజీల కోసం 1,358 ఎకరాల భూసేకరణ ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఫార్మా విలేజీ బదులుగా మల్టీపర్పస్ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. అందులో భాగంగా భూసేకరణను ఉపసంహరించు కుంది. ఈ మేరకు లగచర్ల గ్రామంలో భూసేకరణను ఉపసంహరించు కుంటున్నట్లు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. లగచర్లలో ఫార్మా విలేజ్‌ల కోసం ఆగస్టు 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు, స్థానికులు ఆందోళన చేయగా వారికి ప్రతిపక్షాలు సైతం మద్దతు తెలిపాయి. జరిగిన పరిణామాల దృష్ట్యా ఫార్మా ఇండస్ట్రీ నిమిత్తం భూసేకరణ కోసం ఇచ్చిన నోటి ఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

ఫార్మా విలేజీల కోసం లగచర్లలో 632 ఎకరాలు, హకీంపేట, పోలేపల్లిలో ఫార్మా విలేజీల ఏర్పాటు కోసం జూన్ 7వ తేదీన టిజిఐఐసీ 1,358 ఎకరాల భూసేకరణకు ప్రతిపాదనలు ఇచ్చింది. టిజిఐఐసీ ప్రతిపాదనల మేరకు పట్టా, అసైన్డ్ భూములను సేకరించేందుకు తాండూరు ఆర్డీఓను జూన్ 28వ తేదీన భూసేకరణ అధికారిగా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. పోలేపల్లిలో 71 ఎకరాలు, లగచర్లలో 632 ఎకరాల భూసేకరణకు జూలై, ఆగస్టులో అనుమతిచ్చారు.

లగచర్లలో ఫార్మాసిటీ భూసేకరణ నోటిఫికేషన్ ను రద్దు చేసిన ప్రభుత్వం అక్కడే కొత్తగా ఇండస్ట్రీయల్ కారిడార్ భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఫార్మా కాకుండా వేరే కంపెనీలు అయితే స్వచ్ఛందంగా భూములు ఇస్తామని స్థానికులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన నేపథ్యంలో అక్కడ భారీ ఎత్తున ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన కొత్త నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయబోతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీయల్ పార్క్‌లో టెక్స్ టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పొల్యూషన్ ఉండదు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లుగా తెలుస్తోంది.

అయితే ఫార్మా పరిశ్రమలపై లగచర్లలో రైతులు ఆందోళన చేయడంతో ప్రభుత్వం దీనిని పునః సమీక్షించింది. అక్కడ పెట్టేది ఫార్మావిలేజీ కాదని పారిశ్రామిక జోన్ అని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఫార్మా విలేజీల ఏర్పాటు కోసం భూసేకరణ ఉప సంహ రించుకున్నట్లు వికారాబాద్ కలెక్టర్ టిజిఐఐసీకి తెలియచేశారు. ఫార్మా విలేజీల బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రీయల్ పార్కు కోసం తాజాగా భూసేకరణ కోసం ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే గతంలో ఫార్మా సిటీ విలేజీల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌లను వెనక్కి తీసుకున్నట్లు వికారాబాద్ కలెక్టర్ పత్రికల్లో ప్రకటనలు జారీ చేశారు. తాజాగా ఇండస్ట్రీయల్ పార్కు భూసేకరణ కోసం తాండూరు సబ్ కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ నియమించారు. త్వరలో భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

## ఇంటర్నల్ గ్రేడింగ్ రద్దుపై వెనక్కు...

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 10వ తరగతి పరీక్షల్లో ఇంటర్నల్ మార్కుల రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి ఇంటర్నల్ మార్కులను పూర్తిగా తొలగిస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్నల్ మార్కుల రద్దు ప్రక్రియ ప్రారంభమవుతుందని తాజాగా ప్రకటించింది.

పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి గ్రేడింగ్ విధానాన్ని నిలిపివేస్తూ విద్యాశాఖ గురువారం నిర్ణయం తీసుకుంది. ఇంటర్నల్ పరీక్షలకు 20 మార్కులు, వార్షిక పరీక్షలకు 80 మార్కులు విదనాన్ని నిలిపివేస్తూ ఫైనల్ పరీక్షల్లో ఆరు సబ్జెక్టులను 600 మార్కులకు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు గుడ్‌న్యూస్
### 5 శాతం ఐఆర్ మంజూరు చేస్తూ సర్కార్ ఉత్తర్వులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, యూనివర్సిటీల ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా మధ్యంతర భృతిని ప్రకటించింది. మూలవేతనంలో 5 శాతం ఐఆర్ మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, స్థానిక సంస్థల ఉద్యోగులకు గతేడాది అక్టోబరు 2న ఐఆర్ మంజూరు చేసింది. తమకు కూడా మధ్యంతర భృతి ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సొసైటీలు, యూనివర్సిటీల్లో పనిచేసే నాన్ టీచింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. అంగీకరించిన ప్రభుత్వం వారికి కూడా ఐఆర్ వర్తింపచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## శాలిబండ పీఎస్‌కు జాతీయ గుర్తింపు..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




దేశవ్యాప్తంగా శాలిబండ పీఎస్ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు లభించింది. ఇది అభినందనీయమని డీజీపీ స్పష్టం చేశారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని శాలిబండ పోలీస్ స్టేషన్ దేశంలో 8 ఉత్తమ పీఎస్‌గా ఖ్యాతి గడించడంలో సీపీ సీవీ ఆనంద్, పోలీసు సిబ్బంది కృషి అద్భుతమని డీజీపీ కొనియాడారు. భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగిన డీజీపీల సమావేశంలో శాలిబండ పోలీస్ స్టేషన్‌ను ఉత్తమ పీఎస్‌గా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, పోలీసు సిబ్బంది ప్రదర్శించిన అవిశ్రాంత కృషి, వృత్తి నైపుణ్యం, వినూత్న పోలీసింగ్ విధానాలకు వల్లే ఈ ఖ్యాతి లభించిందని డీజీపీ ఉద్ఘాటించారు. ఈక్రమంలో హైదరాబాద్ పోలీసుల స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీఎస్‌ల సిబ్బంది ముందుకు సాగి విజయాలు కైవసం చేసుకోవాలని డీజీపీ వివరించారు.

## పార్లమెంటులో ఆగని రగడ
### అదానీ, మణిపూర్, సంభాల్ హింసపై చర్చకు ప్రతిపక్షాలు పట్టు
### డిసెంబర్ 2కు సభ వాయిదా



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో గందరగోళ పరిస్థితులు ఆగడం లేదు. అదానీ వ్యవహారం, ఉత్తరప్రదేశ్ సంభాల్ హింస ఘటనతో పార్లమెంటులో రగడ కొనసాగుతోంది. దాంతో గత మూడు రోజులుగా ఎగువ, దిగువ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. నాలుగోరోజైన శుక్రవారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. లోక్‌సభ, రాజ్యసభలు డిసెంబర్ 2కి ( సోమవారానికి) వాయిదా పడ్డాయి.

ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభమయ్యాయి. సమావేశాలు మొదలవ్వగానే ఎగువ సభలో ప్రతిపక్ష ఎంపీల నిరంతర నినాదాలతో సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చైర్మన్ జగదీప్ ధంఖర్ సభ్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ఇలా చేయడం సరికాదు. ఇలా వ్యవహరించి పరిస్థితులపై చెడు ప్రభావాన్ని చూపెడుతున్నాం. ఈ చర్యలు ప్రజల కోసం చేవి కావు. అసంబద్ధవిషయాల కోసం నిరసనలు చేస్తున్నాం. ప్రజలు మనల్ని చూసి ఎగతాళి చేస్తారు. వాస్తవానికి అందరం నవ్వులపాలు అయ్యాము" అని జగదీప్ ధంఖర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సభను డిసెంబర్ 2వ తేదీ (సోమవారానికి)కి వాయిదా వేశారు. సోమవారం 11 గంటలకు తిరిగి సమావేశం కానున్నట్లు ప్రకటించారు.

అటు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అదానీ వ్యవహారంపై చర్చకు విపక్షాల పట్టుతో గందరగోళం తలెత్తింది. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సభాకార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ, అదానీ వ్యవహారం, సంభాల్ హింస గురించి చర్చించాలని విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. నినాదాలతో గందరగోళ పరిస్థితులు సృష్టించారు. ఎంతకీ ప్రతిపక్షాలు శాంతిచకపోవడంతో సభను డిసెంబర్ 2కి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## గురుకులాల్లో కుట్రల వెనుక
# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం

- వాంకిడిలో చనిపోయిన విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం
- మంత్రి కొండా సురేఖ



బలగం టీవి, హైదరాబాద్

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. గురుకులాల్లో కుట్రల వెనుక బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. గతంలో ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా పనిచేశారని.. ఆ సమయంలో తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నారని కొండా సురేఖ అన్నారు.

శుక్రవారం ఆమె మాట్లాడుతూ గురుకుల సంక్షేమ హాస్టళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి పాలనను అడ్డుకోవాలని చూస్తున్నారని.. ప్రభుత్వానికి చెడ్డ పేరు రావాలని ప్రయత్నం చేస్తున్నారని కొండా సురేఖ అన్నారు. వాంకిడిలో చనిపోయిన విద్యార్థి కుటుంబానికి ఒక ఇందిరమ్మ ఇల్లు, ఒక ఉద్యోగం ఇస్తున్నామన్నారు. గురుకుల విద్యార్థిని మరణాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో ఇది మొదటి ఘటన అని.. చాలా బాధగా ఉందన్నారు. "నాగార్జున పిటిషన్: మంత్రి కొండా సురేఖకు మరో షాక్" నిమ్స్‌లో ఆ అమ్మాయికి స్పెషల్ ట్రీట్మెంట్ ఇచ్చామని, కానీ, ఫలితం లేకపోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరైనా చనిపోతే ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. అంత బాధ మీకు ఉంటే ఆ అమ్మాయి కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఘటనల్నులా జరిగాయని, కానీ, అక్కడికి ఎవరూ వెళ్లలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో హాస్టళ్లలోని భోజనంలో పురుగులు వచ్చేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కొరవడినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం ఫుడ్ పాయిజన్ ఘటనకు బాధ్యులైన అధికారులను కూడా సస్పెన్షన్ చేశామన్నారు. ఫుడ్ పాయిజన్ వెనుక ఒక అదృశ్య శక్తి పనిచేస్తోందని.. పూర్తిస్థాయి విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని నడపకుండా చేయాలని ఒక ప్రణాళికతో డ్రామాలు చేస్తున్నారన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని గతంలో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారని మంత్రి గుర్తు చేశారు. గతంలో 99 కోట్ల రూపాయలు టెండర్లు లేకుండానే

మిగితా 3వ పేజీలో

## ఇథనాల్ కంపెనీకి అనుమతులిచ్చింది బీఆర్ఎస్సే

- ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అనుమతి
- ఇథనాల్ ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
- వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథలాల్ కంపెనీకి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులు మంజూరు చేశారంటూ పలు పత్రాలను విడుదల చేసింది. "ఇథనాల్ కంపెనీకి బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. పర్యావరణ శాఖ పర్మిషన్లను ఉల్లంఘించి నిబంధనలను తుంగలో తొక్కారు. కేంద్ర ప్రభుత్వం ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ అనుమతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్,

మిగితా 3వ పేజీలో

# చరిత్ర చదవకుండా.. భవిష్యత్‌ను నిర్మించలేం..

- తెలంగాణ ప్రజల కోసం మరొక్కసారి దీక్ష చేయాల్సిన అవసరం
- ఆత్మగౌరవం, అస్తిత్వం, అస్మిత.. ప్రమాదంలో పడుతున్నప్పుడు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయకపోతే తప్పు చేసినవాళ్లవుతం!
- కేసీఆర్ ఆనవాళ్లు కాదు.. తెలంగాణ ఆనవాళ్లు చెరిపేందుకు రేవంత్ ప్రయత్నం చేస్తున్నాడు.
- కష్టమొస్తే ప్రజలకు తెలంగాణ భవన్ గుర్తొస్తోంది. తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ లా మారింది
- దీక్షా దివస్ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బలగం టీవి, హైదరాబాద్

చరిత్ర చదవకుండా భవిష్యత్‌ను నిర్మించలేమని, తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రసంగించారు.

మన కథను, తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. లేకపోతే మళ్లీ మన తెలంగాణ జాతి పరాయి దండయాత్రలో ఓడిపోయే ప్రమాదం ఉన్నది. అది కాంగ్రెస్ ప్రభుత్వం దాడి రూపంలో కనబడుతుంది మనకు అని కేటీఆర్ తెలిపారు. ప్రతి జాతి తన ఘనమైన వైభవాన్ని పోరాటాలను, త్యాగాలను, విజయాలను కథగానో పాటల రూపంలోనూ నిత్యం తెలియజేస్తూనే ఉంటేనే తర్వాతి తరాలకు తెలుస్తోంది. వీరులను, వీరగాథలను, వీరోచిత యుద్ధాలను నిత్యం స్మరించుకుంటూ ప్రతి జాతి, ప్రతి దేశం తన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఉడుకు నెత్తురున్న యువతకు ఆ పౌరుషాన్ని నూరిపోసే ప్రయత్నం చేస్తోంది. పోరాటాల గొప్పతనాన్ని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంది. రామాయణం, మహాభారత ఇతిహాసాలను పద్యాలుగా, నాటకాలుగా, గ్రంథాలుగా ప్రతి తరాన్ని చేరి భారత జాతిని ఐక్యంగా నిలబెట్టాయి. అదే మాదిరిగా తెలంగాణ జన సంప్రదాయంలో ఒగ్గు కథలు, బుర్ర కథలు, యక్షగానాలు, బతుకమ్మ పాటలు, నృత్య రూపాలు, చిత్రకళలు, చరిత్ర పాఠాలు, శిలాశాసనాలు ఎన్నెన్నో రకాలుగా ఘనమైన సంస్కృతిని, మహనీయులను, వైతాళికులను గుర్తు చేసుకునే విధంగా మనకు ఉపయోగపడ్డాయని కేటీఆర్ తెలిపారు.

ఒక జాతి సంక్షోభంలో ఉన్నప్పుడు తల్లడిల్లుతున్నప్పుడు ఒక యోధుడు పుడుతాడు. ఆ యోధుడు స్పార్టకస్, గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా.. ఎవరో ఒకరు పుట్టి.. ఆ జాతిని మేల్కొలిపితే కదిలి మళ్లీ తిరిగి స్వాతంత్ర్యం సాధించుకున్నారు. ప్రతి దేశానికి, ప్రాంతానికి, జాతికి ఒక కథ ఉంటుంది. ఒక కథా నాయకుడు ఉంటాడు. ప్రతినాయకులు ఉంటారు. త్యాగాలు, విద్రోహాలు ఉంటాయి. జయాలు, అపజయాలు ఉంటాయి. ఎదురుదెబ్బలు, గుణపాఠాలు ఉంటాయి. అలాగే తెలంగాణ కథలో కూడా ఉన్న ఒక్క కథా నాయకుడు కలిసొచ్చే కాలానికి నడిపొచ్చే కొడుకు 2001లో గులాబీ జెండాతో తెలంగాణ తల్లికి జన్మనిచ్చిన తనయుడు కేసీఆర్ గారి రూపంలో మన ముందుకు వచ్చాడు. మన కథను తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాల్సిన బాధ్యత ఉన్నది. లేకపోతే మళ్లీ మన తెలంగాణ జాతి పరాయి దండయాత్రలో ఓడిపోయే ప్రమాదం ఉన్నది. అది కాంగ్రెస్ ప్రభుత్వం దాడి రూపంలో మనకు కనబడుతుందని కేటీఆర్ అన్నారు.

### గుజరాతీ గులాంలు.. ఢిల్లీ కీలుబొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి కచ్చితంగా ప్రమాదం

గుజరాతీ గులాంలు.. ఢిల్లీ కీలుబొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి కచ్చితంగా ప్రమాదం ఉంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగితా 3వ పేజీలో

# రౌడి షీటర్స్‌పై నిరంతరం నిఘా ఉంచాలి



- చట్ట వ్యతిరేక కార్యకలాపాలు,
  అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, వేములవాడ**

జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను,కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ గంజాయి రవాణా పకడ్బందీగా నియంత్రించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఎస్పీ అఖిల్ మహల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మాట్లాడుతూ నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా సమర్థవంతంగా పని చేయాలని,పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ శాఖ వినియోగిస్తున్నా సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ నేరాలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు.

వివిధ నేరాల్లో నిందుతులుగా ఉండి షీట్లు తెరువబడి వారు విధిగా పోలీస్ స్టేషన్ కి హాజరు కావాలని లేని పక్షంలో బైండోవర్ చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్ల,హిస్టరీ షీటర్స్ ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్స్ తెరవాలని ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలు అయిన పేకాట,గుడుంబా,పిడిఎస్ రైస్,వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయాలని అన్నారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచి వారిపై కేస్లు నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, ఎస్ఐ లు ,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు పండుగకు రైతులందరూ తరలిరావాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నేడు రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 13 రైతు వేదికలలో ఈ కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులందరూ తమ గ్రామాలకి సమీపంలో ఉన్న సోదరులందరూ పెద్ద సంఖ్యలో రైతు వేదికలకు తరలివచ్చి, సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని తెలిపారు.

కోనరావుపేట మండలం నిజామాబాద్, తంగళ్లపల్లి మండలం తాడూరు, గంభీరావుపేట మండలం నర్మాల, రుద్రంగి, ముస్తాబాద్ మండలం బద్దనకల్, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, చందుర్తి, బోయినపల్లి మండలం కొదురుపాక, వేములవాడ అర్బన్ మండలం మారుపాక, వీర్నపల్లి, ఇల్లంతకుంట రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నామని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## విద్యార్థులు ప్రతి పరీక్షలో రాణించేలా సిద్ధం చేయాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, సిరిసిల్ల**

విద్యార్థులు ప్రతి పరీక్షలో రాణించేలా సిద్ధం చేయాలని టీచర్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యాలయం ఆవరణ, కిచెన్ గది, కూరగాయలు, బియ్యం, కోడిగుడ్లు, పండ్ల నాణ్యతను పరిశీలించారు. విద్యాలయం ఆవరణ స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు? అని ఆరా తీశారు. మొత్తం 548 మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ థెరిసా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ఇక్కడ విద్యాలయం టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండుగకు ఆహ్వానం..

- రైతులందరూ తరలిరావాలి
- సీఎం సభ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసారం
- వ్యవసాయ అధికారి ప్రణీత



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.ఈ నెల 30వ తేదీన శనివారం రోజున రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికారి ప్రణీత ప్రకటనలో తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. మండలం లోని రైతులందరూ పెద్ద సంఖ్యలో కోదురుపాక రైతు వేదికకు తరలివచ్చి, సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

- చదువుతోపాటు ఆటల్లో రాణించాలి
- ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ,కొనరావుపేట:**

విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలంలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రభుత్వ విప్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు..ఈ రోజు మెనూలో ఏ ఆహార పదార్థాలు పెట్టారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విప్ మాట్లాడతు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని,వారు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆటలు దేహదారుఢ్యానికి, మనోవికాసానికి దోహదం చేస్తాయని వివరించారు.అనంతరం ఇటీవల మరణించిన గజ్జెల అజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.. కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 14 లక్షల 30 వేల విలువగల 44 ముఖ్యమంత్రి సహాయ నిధి చేక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు..వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు.. అందులో భాగంగానే రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల పెంచడం జరిగిందని పేర్కొన్నారు.. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.. వివిధ అనారోగ్య కారణాలవల్ల చికిత్స తీసుకునే వారికి ఎల్ఓసిలను మంజూరు చేపించడం జరుగుతుందని తెలిపారు..

## ఎన్ఆర్‌జీఎస్ సీసీ రోడ్డుకు శంకుస్థాపన



**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 8 లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సబేరా బేగం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణపూర్ నుండి రాగట్లపల్లి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు నుండి నల్ల పోచమ్మ ఆలయం వరకు ఈ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.ఈ రోడ్డు నిర్మాణానికి సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వం ఈజీఎస్ పనుల కింద సుమారు 35 లక్షల రూపాయల వరకు సిసి రోడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలోనే మంజూరు చేసిన సిసి రోడ్ల నిర్మాణాలు ఇప్పుడు పూర్తి అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి చేస్తున్నదని అన్నారు 2 లక్షల రూపాయల పైన ఉన్న రుణాలపై ప్రభుత్వం శనివారం మార్గదర్శకాలను విడుదల చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వస్తుందన్నారు ధాన్యం సేకరణలో ఎల్లారెడ్డిపేట ఐకెపి ముందువరుసలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి జాఫర్ మాజీ ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్, నాయకులు నిమ్మ నారాయణరెడ్డి మోతె నరసింహారెడ్డి దొమ్మాటి రాజు, ఎస్కే షాదుల్లా నిమ్మ మల్లారెడ్డి లద్దునూరి హనుమాన్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేములవాడలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్..

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో
  1000 గజాల స్థలం కేటాయింపు...
- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో వేములవాడ ప్రాంతంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం కావాల్సిన వారికి కష్టాలు తప్పునున్నావని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు స్థల కేటాయింపు పత్రాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంత రావు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే వేములవాడ పట్టణంలో రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు,రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా భూమి పూజ నిర్వహిస్తామని అన్నారు.వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు, రాజన్న భక్తులకు అత్యవసర సమయాల్లో రక్తం సులువుగా దొరుకుతుంది అని అన్నారు.రాజన్న భక్తులతో పాటు ఈ ప్రాంత ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండాలనే ముఖ్య ఉద్దేశ్యంతో వేములవాడలో ఈ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ప్రస్తుతానికి భవన నిర్మాణం కొరకు ఆసుపత్రి ఆవరణలో 1000 గజాల స్థలాన్ని కేటాయించామని, భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకా అవసరమైన స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అన్నారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో రక్త పరీక్షలు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ తగ్గడం, పెరగడం, తలసేమియాతో బాధపడుతున్న బాధితులకు రక్త సమస్యలకు సంబంధించిన పరిష్కారం దొరుకుతుంది అని అన్నారు.స్థానికంగా బ్లడ్ బ్యాంకులు అందుబాటులో లేక ఇన్ని రోజులు కరీంనగర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రస్తుతం బ్లడ్ బ్యాంకు ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల రక్త కష్టాలు తీరని ఉన్నాయని అన్నారు. జిల్లాకు సంబంధించిన రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ను వేములవాడలో ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన గవర్నర్ మరియు సొసైటీ అధ్యక్ష కార్యదర్శులకు ఈ ప్రాంత ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే భవన నిర్మాణం చేపట్టి త్వరగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులను కోరారు.

## తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలో ఉన్న అన్ని హైస్కూల్ లకు సంబంధించిన విద్యార్థులకు గణిత ప్రతిభాపాట పోటీలను హైస్కూల్లో నిర్వహించారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 22 గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా గణిత ప్రతిభాపాటవ పోటీలను తెలంగాణ మ్యాథ్స్ ఫోరం వారు నిర్వహిస్తున్నారు. ఇందులో రాచర్ల తిమ్మాపూర్ కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహరాచారి తెలంగాణ మాక్స్ ఫోరం మండల అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి మైదామిశెట్టి మల్లికార్జున్,టిఎంఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమాన్లు, అదేవిధంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీనివాస్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఘనిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి



**బలగం టీవీ, సిరిసిల్ల**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో డ్రాలో రాని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి,నివాస స్థలంతోపాటు, ఇల్లు నిర్మించుకోవడానికి ఐదు లక్షల అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ అన్నారు. శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ డ్రాలో రానీ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఇంటి స్థలం తో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షలు ఇవ్వాలని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కి సీపీఎం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ లు మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో పేద ప్రజలు ఎన్నో ఏళ్ల నుండి ఇల్లు లేక కిరాయికుంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు.తెలంగాణ వచ్చినంక సొంత ఇల్లు వస్తుందని ఆత్మగౌరవంతో బతకవచ్చు ఆశతోటి ఎదురుచూసిన వారి ఆశలు అడి ఆశలయ్యాయని అన్నారు. గత ప్రభుత్వంలో అనేక సర్వేలు నిర్వహించి ఎంపిక చేసి అందరికీ సరిపోయే ఇండ్లు నిర్మించకుండా, డ్రా ద్వారా ఎంపిక చేయడం వలన వీరికి అన్యాయం జరిగింది అని అన్నారు.అప్పుడు అధికాంపులు సరియైన సర్వే నిర్వహించకపోవడంతో అనర్హులకు కూడా చాలామందికి డబుల్ బెడ్ రూమ్ రావడం జరిగింది అని,అసలైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని అన్నారు.అర్హులైన వాళ్ళందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది అని,కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారని అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరుగుతుందిఅని,కొన ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు కోడం రమణ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ ,ఎలిగేటి రాజశేఖర్ బెజిగం సురేష్. వడ్నాల వీరేశం,మోర తిరుపతి, నల్ల బాలు, దాసరి రూప,గట్ల సప్న, బోనాల లక్ష్మి పాల్గొన్నారు.

## వెన్నెల మ్యారేజ్ బ్యూరోను ప్రారంభించిన జనగం లక్ష్మణ్



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో చౌరస్తా వద్ద వెన్నెల మ్యారేజ్ బ్యూరోను వెన్నెల మ్యారేజ్ బ్యూరో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు జనగం లక్ష్మణ్ ప్రారంభించినారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ: అన్ని కులాల వారికి మొదటి, రెండవ పెళ్లి సంబంధాలు చూడబడునని, పెళ్లి సంబంధాలు కావలసినవారు 9948211730 గల ఈ నెంబర్ ను సంప్రదించగలరని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల లక్ష్మణ్, కనకరాజు, కొండం శ్రీనివాసరెడ్డి, రాజేంద్రప్రసాద్, రఫీ, రాజయ్య, శ్రీనివాస్, బాపురెడ్డి, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం రేవంత్ సభ..

**బలగం టీవీ , హైదరాబాద్**

పెద్దపల్లిలో డిసెంబరు 4న జరగనున్న యువ శక్తి సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై సుమారు 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లిలో డిసెంబర్ 4వ తేదీన తలపెట్టిన ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువతకై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్4 లో ఎంపికైన 8143 మందికి, 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందచేస్తారని వివరించారు. ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో బాగస్వామ్యమయ్యే 7 ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలను సంతకం చేయడం జరుగుతుందని,, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ప్రారంభోత్సవం, సి.ఎం కప్ ప్రారంభం లతో పాటు వందలాది కోట్ల రూపాయల విలువైన అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే దాదాపు 40 స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే, వరంగల్, మహబూబ్ నగర్ లో మాదిరిగానే పెద్దపల్లి సభకు విస్తృత ఏర్పాట్లను చేయాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

## నిమ్స్‌లో పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నేతలు

**బలగం టీవీ , హైదరాబాద్**



'తెలంగాణ రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' ఏదో ఒకటి తేలిపోవాలని ప్రకటించి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో రోగులకు బీఆర్ఎస్ నేతలు పండ్లు పంపిణీ చేశారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్ తదితర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంగ్లండ్ 319/5

**బలగం టీవీ , హైదరాబాద్**



న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పర్యాటక ఇంగ్లండ్ టీమ్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. ఆతిథ్య న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 91 ఓవర్లలో 348 పరుగులకు ఆలౌటైంది. గ్లెన్ ఫిలిప్స్ 58 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ క్రాస్, షోయబ్ బషీర్ నాలుగేసి వికెట్లను పడగొట్టారు. గుస్ అట్కిన్సన్‌కు రెండు వికెట్లు లభించాయి. కాగా, కివీస్ టీమ్‌లో కేన్ విలియమ్సన్ (93) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ జాక్ క్రాలి డకౌటయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన జాకబ్ బెథెల్ 10 పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగాడు. స్టార్ బ్యాటర్ జోరూట్ (0) సున్నాకే ఔటయ్యాడు.దీంతో ఇంగ్లండ్ 45 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. కొద్ది సేపటికే ఓపెనర్ బెన్ డకెట్ (46) కూడా పెవిలియన్ బాట పట్టాడు. దీంతో ఇంగ్లండ్ 71 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో హారి బ్రూక్, వికెట్ కీపర్ ఒలి పోప్ కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఈ జోడీని విడగొట్టేందుకు ఆతిథ్య టీమ్ బౌలర్లు చేసిన ప్రయత్నాలు చాలా సేపటి వరకు ఫలించలేదు.అద్భుత ఇన్నింగ్స్ ఆడిన పోప్ 98 బంతుల్లో 8 ఫోర్లతో 77 పరుగులు చేసి ఔటయ్యాడు. చిరస్మరణీయ బ్యాటింగ్‌తో అలరించిన బ్రూక్ 163 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 132 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ 37(నాటౌట్) అతనికి అండగా ఉన్నాడు. దీంతో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ స్కోరు 74 ఓవర్లలో 5 వికెట్లకు 319 పరుగులకు చేరింది. అయితే కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఇంగ్లండ్ మరో 29 పరుగులు చేయాలి.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి దామోదర రాజనర్సింహా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ దవాఖానల్లో సిబ్బంది, మందులు అందుబాటులో లేకుంటే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు, వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కేర్‌గా బలోపేతం చేయడంపై సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక



ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న సేవల బలోపేతంపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విస్తరించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవరావు, డీఎంఈ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డిప్యూటీ డీఎంఈ విమల థామస్ పాల్గొన్నారు.

# మూసీ నది ప్రక్షాళనకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం

- మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ముందుకు రావడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ దేశ రాయబారి రువెన్ అజర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి ఇజ్రాయెల్ ఎంతో ఆసక్తి కనబర్చడం సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని, ఆ రంగాల్లో తెలంగాణాకు సహకరించాలని శ్రీధర్?బాబు కోరారు. రక్షణ రంగం, వ్యవసాయం, నీటి వినియోగంలో ఆధునిక సాంకేతికత, నూతన పరిశోధనలు, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాటునందించాలని మంత్రి చేసిన అభ్యర్థనకు రువెన్ అజర్ సానుకూలంగా స్పందించారు.

200 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని శ్రీధర్ బాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ అత్యాధునిక శిక్షణలో మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికలో తమకు సహకరించాలని శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో యంగ్



ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని.. ఇజ్రాయెల్ దేశం ఏ ఫ్యాక్టరీ పెట్టడానికి ముందుకొచ్చినా స్కిల్? కలిగిన మానవ వనరులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అధునాతన పరిజ్ఞానం, పరిశ్రమల ఏర్పాటులో సాయపడితే ఇక్కడి నుంచే ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని మంత్రి సూచించారు. రక్షణ రంగం, ఏరో స్పేస్‌లో స్టార్టప్ సంస్థలకు టెక్నాలజీ సమకూర్చి ముందుకు నడపాలని శ్రీధర్ బాబు కోరారు. మౌలిక వసతుల నిర్మాణంలో రెండు దేశాలు సహకరించుకోవాలన్న ఇజ్రాయెల్ రాయబారి ప్రపోజల్‌కు ఆయన ఆమోదం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబులు తమ దేశాన్ని సందర్శించాలని రాయబారి రువెన్ ఆహ్వానం పలికారు.

తెలంగాణతో వ్యాపార సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు ఆసక్తితో ఉన్నామని తుర్కియే దేశపు రాయబారి ఫిరట్ సునెల్ వెల్లడించారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో భేటీ అయిన ఆయన పరస్పర సహకారంపై చర్చించారు. తుర్కియే తెలంగాణాల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఎంతో కాలంగా కొనసాగుతున్నాయని శ్రీధర్ బాబు అన్నారు. వ్యవసాయం, ఫార్మా, లైఫ్ సైన్సెస్, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని ఆయన తెలిపారు. తుర్కియే పారిశ్రామిక ప్రతినిధుల బృందాన్ని పంపిస్తే వారు ఇక్కడి అనుకూల వాతావరణాన్ని పరిశీలించే అవకాశం ఉంటుందన్న అభ్యర్థనకు రాయబారి ఫిరట్ సునెల్ సుముఖత వ్యక్తం చేసారు. భేటీలో తుర్కియే కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యమన్ ఓకన్ కూడా పాల్గొన్నారు.

# చరిత్ర చదవకుండా.. భవిష్యత్‌ను నిర్మించలేం..

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. శత్రువులు కుట్రలు చేస్తూనే ఉంటారు. ప్రత్యర్థులు దాడులు చేస్తూనే ఉంటారు. తెలంగాణ ఏర్పాటుతో నష్టపోయిన శక్తులు ఏదో రూపంలో పెత్తనం కోసం ఆరాటపడుతూనే ఉంటారు. కేసీఆర్ సీఎం పదవి నుంచి దిగిపోగానే నిన్నటి వరకు అణిగిమణిగి ఉన్న కొన్ని శక్తులు ఎలా రెచ్చిపోతున్నాయో ఆలోచించండి. సమైక్యాంధ్రుల సంచులు మోసిన తెలంగాణ ద్రోహులు తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

తెలంగాణ ముఖ్యమంత్రి అంటుడు.. సోనియమ్మ లేకపోతే తెలంగాణ అడుక్కుతింటుండే అని అహంకారంతో మాట్లాడుతున్నాడు. తెలంగాణ విద్యార్థుల ఆత్మబలిదానాలను, పోరాటాలను కించపరుస్తున్నాడు. తల్లిని చంపి బిడ్డను వేరు చేసిండు అని ఒకాయన అంటడు. ఒక గుజరాతీ వచ్చి విడిపించిండు.. మరో గుజరాతీ వచ్చి అభివృద్ధి నేర్పిస్తుండు అని ఒకాయన అంటున్నాడు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మలిదశ ఉద్యమం వరకు అవమానించే విధంగా నోరు పారేసుకుంటున్నారు. గుజరాతీ గులాం లు, ఢిల్లీ కీలుబొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి కచ్చితంగా ప్రమాదం ఉంది. తెలంగాణ సమాజానికి స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామ రక్ష. గులాబీ పార్టీ వో దు ఉండాలి తప్ప గులాంల పార్టీవోడు కాదు అని స్పష్టం చేశారు.

తెలంగాణ ఉద్యమంపై ఎక్కుపెట్టిన నాయకుడు సీఎం అయిండు.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తా అని రెచ్చిపోతున్నాడు. కేసీఆర్ ఆనవాళ్లను కాదు.. తెలంగాణ ఆనవాళ్లను చెరిపేయాలనుకుంటున్నాడు. తెలంగాణ రాజముద్రలోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ తీసేస్తా అంటున్నాడు. దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నడు. మనందరం ప్రణమిల్లే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేస్తా అంటున్నడు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి స్థానాన్ని కబ్జా పెట్టి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి ఢిల్లీకి గులాంగిరి చేస్తున్నడు. నీళ్లు, నిధులు నియమకాలు ఉద్యమ నినాదం కాదని నీలుగుతున్నాడు. ఇవి మమూలుగా తీసుకునే విషయం కాదు.. తెలంగాణ వీర చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాడు. కచ్చితంగా తెలంగాణలోని కవులు, కళాకారులు, మేధావులు, ఉద్యోగ సంఘాలు.. ప్రతి బిడ్డ వీరిని చీల్చి చెండాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

**లగచర్ల భూముల సేకరణ విరమణ బీఆర్ఎస్ విజయం**

లగచర్ల భూముల సేకరణ విరమణ బీఆర్ఎస్ విజయం.. తెలంగాణ ప్రజల విజయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంట్‌లో మన గళం వినిపించే నాథుడే లేడు. తెలంగాణ గొంతు బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.

ఈ రియల్ ఎస్టేట్ బేహారీకి, పాలన తెలియదు. మీ భూములు తీసుకొని రియల్ ఎస్టేట్ దందా చేయటం మాత్రమే తెలుసు. మరొక రూపంలో మీ భూములు కావాలంటూ మళ్లీ వస్తాడు. జాగ్రత్తగా ఉండాలే. ఈ ప్రభుత్వంపై ప్రతిఘటన మాత్రమే మనకు ఉన్న గత్యంతరం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ అయ్యింది. మైనార్టీ సోదరులు కూడా మనవాళ్లు ఎవరో.. కానివాళ్లు ఎవరో గుర్తించాలి. బీఆర్ఎస్ మీద తప్పుడు ప్రచారం చేసి ప్రయోజనం పొందారు. కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడుతుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# బస్సు బోల్తా.. 9మంది మృతి

- మహారాష్ట్రలో ఘటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రలోని గోండియా జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది ప్రయాణికులు మరణించారు. మరో 25 మంది గాయపడ్డారు. భండారా నుంచి గోండియా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడడం వల్ల జరిగింది విషాదం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బైకును తప్పించే ఈ క్రమంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భండారా నుంచి బయలుదేరిన ఎమ్మెస్సార్టీసీ బస్సు 'శివ్ షాహి' 36 మంది ప్రయాణికులతో కోహ్మారా హైవేపై వెళ్తుండగా ఉన్నట్టుండి ఓ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చింది. దాని తప్పించే క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ఇంకోవైపునకు తిప్పడం వల్ల బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరగ్గానే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, గాయపడిన వారికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాను మోదీ అందిస్తున్నారని పీఎంఓ కార్యాలయం పేర్కొంది. ఈ ప్రమాదంలో జరిగిన ప్రాణనష్టంపై ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే సంతాపం వ్యక్తం చేశారు. మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గోండియా కలెక్టర్‌తో మాట్లాడి గాయపడిన ప్రయాణికులందరికీ మెరుగైన చికిత్స అందించి వైద్యం అందించాలని ఆదేశించారు. అవసరమైతే వారిని ప్రత్యేక చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించాలని, అందుకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

# గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చు చేశారన్నారు. 103 బీఆర్ఎస్ నేతల బంధువుల భవనాలు గురుకు లాలకు కిరాయికి ఇచ్చారని మంత్రి అన్నారు. కేటీఆర్ భయపడుతున్నారు లగచర్లలో కలెక్టర్‌ను మర్డర్ చేయాలని చూశారని ఆరోపించారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల ఉసురు తీసుకోలేదా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. కేటీఆర్ సోదరి లోపల ఉన్నన్ని రోజులు మంచిగానే ఉన్నాడని.. కానీ, బయటకు వచ్చిన నాటి నుంచి భయపడుతున్నారన్నారు. కవిత, హరీశ్ రావు ఒక్కటయ్యారని కేటీఆర్ భయపడుతున్నారన్నారు. కేసీఆర్ కవితకు ప్రియారిటీ ఇస్తున్నారని కేటీఆర్ భయపడుతున్నారని చెప్పుకొచ్చారు. మరోవైపు, వరంగల్ విమానాశ్రయం కోసం 254 ఎకరాలు భూ సేకరణ చేస్తామన్నారు.

# ఇథనాల్ కంపెనీకి అనుమతులిచ్చింది బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

అబ్సల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తులకు అప్పటి మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో కంపెనీకి అనుకూలంగా పర్మిషన్లు ఇచ్చారు. మినహాయింపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ అడ్డదారులు అనుసరించింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం స్థానిక సంస్థలు ఎన్‌వోసీ తీసుకోవాలి. అలా చేయకుండానే పీఎంకే డిస్టిలేషన్స్ కాంపౌండ్ వాల్ నిర్మించింది. భారాస ప్రభుత్వ అండతో పీఎంకే డిస్టిలేషన్స్ నిబంధనలు ఉల్లంఘించింది. 2022 అక్టోబర్ 22న గత ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ చేసింది. 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఇతర ఉత్పత్తుల కోసం గత ప్రభుత్వం ఎల్‌వోఐ జారీ చేసింది" అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# రేవంత్ ఏనాడైనా జై తెలంగాణ అన్నాడా : హరీశ్‌రావు

బలగం టీవీ, సిద్దిపేట

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిద్దిపేటలో దీక్ష చేయని మనిషే లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. ఉద్యమాల కోట దుబ్బాక, గజ్వేల్‌లోనూ దీక్ష చేశారని అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన దీక్షా దివాస్‌లో ఆయన పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో మన భాగస్వామ్యం.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నంత గొప్పదని చెప్పారు. రేవంత్ ఏనాడైనా జై తెలంగాణ అన్నాడా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఒక్క ఉద్యమ కేసైనా ఉన్నదా అని అడిగారు. తమ మీద వందల కేసులు నమోదు చేశారని తెలిపారు. ఇచ్చిన తెలంగాణ ప్రకటనను కాంగ్రెస్ సర్కార్ వెనక్కి తీసుకున్నప్పుడు ఉద్యమం ఉవ్వెత్తున మొదలైందని.. అప్పుడు ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని తెలంగాణ ప్రజలు డిమాండ్ చేశారని గుర్తుచేశారు. అప్పుడు రాజీనామా చేయకుండా రేవంత్ రెడ్డి పారిపోయిండని విమర్శించారు. ఇప్పటి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా రాజీనామా చేయలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి మీద ఉద్యమ కేసులు లేవు కానీ.. ఓటుకు నోటు కేసు మాత్రం నమోదైందని అన్నారు. అలాంటి రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తారా అని మండిపడ్డారు.

# నేడే దాయాదుల సమరం

## అండర్-19 ఆసియా కప్‌లో తలపడనున్న భారత్-పాకిస్థాన్




**బలగం టీవీ, హైదరాబాద్**

దాయాదుల సమరానికి సర్వం సిద్ధమైంది. యుద్ధాన్ని తలపించే పోరుకు భారత్-పాకిస్థాన్ ఆటగాళ్లు రెడీ అవుతున్నారు. అండర్-19 ఆసియా కప్-2024లో భాగంగా దుబాయ్ వేదికగా జరిగే కీలక మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. టోర్నీలో ఇరు జట్లకు ఇదే తొలి మ్యాచ్ కావడంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుత ఎన్నాయి. శనివారం జరిగే ఈ హైఓల్టేజ్ మ్యాచ్.. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది.

అండర్-19 ఆసియా కప్-2024 ఎడిషన్‌కు సంబంధించిన మ్యాచులన్నీ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో లైవ్ టెలికాస్ట్ కానున్నాయి. అండర్-19 ఆసియా కప్‌లో భాగంగా రేపు జరిగే భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను సోనీ లివ్ యాప్‌లో కూడా వీక్షించొచ్చు. ఈ మ్యాచుల్ని ఉచితంగా చూసే వెసులుబాటు కూడా ఉంది. జియో, ఎయిర్‌టెల్ యూజర్లు టోర్నీ మ్యాచులను ఫ్రీగా స్ట్రీమింగ్ చేయొచ్చు. జియో టీవీ, ఎయిర్‌టెల్ టీవీ యాప్‌లో సోనీ టెన్ ఛానెల్స్‌ను సెలెక్ట్ చేసి లైవ్‌లో చూడొచ్చు. కాగా, ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా ఆక్షన్‌లో రూ.1.10 కోట్లు పలికిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మీదే అందరి ఫోకస్ ఉంది. ఈ బిహార్ కుర్రాడు అండర్ 19 టీమ్‌కు సెలెక్ట్ అయ్యాడు. దీంతో అతడు హాట్ ఫేవరెట్‌గా మారాడు.

ఈ టోర్నీలో మొత్తం 8 జట్లు తలపడుతుండగా.. రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్, పాకిస్థాన్, జపాన్, యూఏతో గ్రూప్-బీలో ఉండగా.. డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, నేపాల్ గ్రూప్-ఏలో ఉన్నాయి.

**జట్లు**

భారత్: ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, ఆంద్రీ సిద్దార్థ్, మహమ్మద్ అమన్(కెప్టెన్), కిరణ్ కోర్మాలే(వైస్ కెప్టెన్), ప్రణవ్ పంత్, హర్వన్ష్ సింగ్ పంగాలియా(కీపర్), అనురాగ్, హార్దిక్ రాజ్, మహమ్మద్ ఇనాన్, కేపీ కార్తికేయ, సమర్థ్ నాగ్‌రాజ్, యుధజిత్ గుహ, చేతన్ శర్మ, నిఖిల్ కుమార్

పాకిస్థాన్: సాద్ బైగ్, మహమ్మద్ అహ్మద్, హరూన్ అర్షద్, టయ్యబ్ ఆరిఫ్, మహమ్మద్ హుజెఫ, నవీద్ అహ్మద్ ఖాన్, హసన్ ఖాన్, షెహ్‌జైబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఫహమ్ ఉల్ హక్, అలీ రాజా, మహమ్మద్ రైజుల్లా, అబ్దుల్ సుభాన్, ఫర్హాన్ యూసఫ్, ఉమర్ జైబ్.

# మైదానంలో విషాదం..





## మ్యాచ్ ఆడుతూ గుండెపోటుతో క్రికెటర్ మృతి..

**బలగం టీవీ, హైదరాబాద్**

క్రికెట్ మైదానంలో విషాదం నెలకొంది. మ్యాచ్ ఆడుతూ ఓ యువ క్రికెటర్ గుండెపోటుతో మృతిచెందాడు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఇమ్రాన్ పటేల్ అనే 35ఏళ్ల క్రికెటర్ గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. రాష్ట్రంలోని గార్వేర్ స్టేడియంలో చిన్న లీగ్ మ్యాచ్లు జరుగుతున్నాయి. క్రికెటర్ ఇమ్రాన్ పటేల్ కూడా ఈ లీగ్ మ్యాచ్లో పాల్గొన్నాడు. మ్యాచ్ జరిగిన ప్రతిసారి ఇమ్రాన్ పటేల్ ఓపెనింగ్ బ్యాటింగ్ చేసేవాడు. ఈ మ్యాచ్‌లో కూడా ఇమ్రాన్ పటేల్ ఓపెనింగ్‌కు దిగాడు. కొన్ని ఓవర్ల పాటు బ్యాటింగ్ కూడా చేశాడట. బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారి చాతిలో నొప్పిగా ఉందని అంపైర్లకు చెబుతూ వస్తున్నాడు. మ్యాచ్‌లో ఐదు ఓవర్లు పూర్తి అయ్యాక చెస్ట్ అలాగే లెఫ్ట్ ఆర్మ్ లో తీవ్రమైన నొప్పిగా ఉందని అంపైర్లకు చెప్పాడు. అనంతరం పెవిలియన్ కు వెళ్తూ గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలాడు. హుటాహుటిన అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే ఇమ్రాన్ పటేల్ మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మ్యాచ్‌ను లైవ్ స్ట్రీమ్ చేస్తున్న నేపథ్యంలో.. ఆ ఘటన కెమెరాలకు చిక్కింది. బ్యాటర్ ఇమ్రాన్ పటేల్ కిందపడిపోగానే, ప్లేయర్లు అందరూ అతని వైపు పరుగులు తీశారు.

ఇమ్రాన్‌కు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని తోటి జట్టు సభ్యులు వెల్లడించారు. ఆల్‌రౌండర్ అయిన అతను చాలా ఫిట్‌గా ఉంటాడని తెలిపారు. ఏ కారణం చేత అతనికి కార్డియాక్ అరెస్టు అయినట్లు స్పష్టంగా తెలియదు. ఇమ్రాన్ పటేల్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇమ్రాన్‌కు తన ఏరియాలో మంచి గుర్తింపు ఉంది. అతనికి ఓ క్రికెట్ జట్టు ఉన్నది. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కూడా ఉన్నాడతను. ఓ జ్యూష్ షాపును కూడా నడిపిస్తున్నాడు.

## సమంత తండ్రి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



స్టార్ హీరోయిన్ సమంత ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు మృతి చెందారు. ఈ విషయాన్ని సమంత తన ఇన్‌స్టా స్టోరీలో తెలియజేశారు."మనం మళ్లీ కలిసే వరకు, నాన్న" అంటూ ఆమె హార్ట్ బ్రేకింగ్ ఎమోజీని షేర్ చేశారు.

సమంత చెన్నైలో జోసెఫ్ ప్రభు, నీనెట్ ప్రభు దంపతులకు జన్మించింది. ఆమె తండ్రి, తెలుగు ఆంగ్లో-ఇండియన్. సమంత జీవితంలో ఆమె తండ్రి ముఖ్య పాత్ర పోషించారని గతంలో ఎన్నోసార్లు సామ్ చెప్పుకొచ్చింది. ఓవైపు చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సామ్ తన తల్లిదండ్రులను కలిసేందుకు ప్రాధాన్యత ఇస్తుండేది. సినీరంగంలో తనకు ప్రతి క్షణం తన తండ్రి అండగా, మద్దతుగా నిలిచారని తెలిపింది. సామ్ తండ్రి మరణవార్త తెలియడంతో సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## 'పీలింగ్స్' ప్రోమో రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించిన చిత్రం పుష్ప 2 ది రూల్. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో వరుస అప్‌డేట్‌లను ఇస్తుంది చిత్రబృందం. ఈ మూవీ నుంచి ఇప్పటికే ట్రైలర్‌తో పాటు మూడు పాటలను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మరో సాంగ్‌ను అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ మూవీ నుంచి పీలింగ్స్ అనే పాట ప్రోమోను పుష్ప టీమ్ తాజాగా విడుదల చేసింది. కొచ్చిలో జరిగిన మూవీ ఈవెంట్‌లో అల్లు అర్జున్ ఈ పాట గురించి అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను వదిలారు. ఈ పాట లోని పల్లవి లిరిక్స్‌కు సంబంధించి అన్ని భాషల్లోనూ మలయాళంలోనే ఉండనున్నాయి.




## యూ ముంబాపై తెలుగు టైటాన్స్ విజయం

**బలగం టీవీ, గ్రేటర్ నోయిడా**

ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్)లో గురువారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 41-35తో యూ ముంబాపై అద్భుత విజయం సాధించింది. మ్యాచ్ ఆసాంతం తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన టైటాన్స్ తరఫున విజయ్ మాలిక్ (10), అశీష్ నర్వాల్ (10) సూపర్ టెన్‌షో చేయగా, డిఫెండర్ సాగర్ (5) హైఫైవ్‌తో ఆకట్టుకున్నాడు. ప్రథమార్ధంలో 25-13తో ఆధి క్యం కొనసాగించిన టైటాన్స్.. ద్వితీయార్ధంలోనూ అదే జోరు ప్రదర్శించింది.



## డిసెంబర్‌లో నా పెళ్లి : కీర్తి సురేశ్

**బలగం టీవీ, హైదరాబాద్**

గత కొంత కాలంగా జరుగుతున్న తన పెళ్లి ప్రచారంపై అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ తాజాగా స్పందించారు. ఆ వార్తలను నిజం చేస్తూ.. వచ్చే నెలలో తన బాయ్‌ఫ్రెండ్‌ను పెళ్లాడనున్నట్లు స్పష్టం చేశారు. కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తి సురేశ్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొ న్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల కీర్తి సురేశ్ మాట్లాడారు. డిసెంబర్‌లో గోవాలో తన పెళ్లి జరగనున్నట్లు ప్రకటించారు. అందుకే స్వామివారి దర్శనానికి వచ్చినట్లు వెల్లడించారు. డిసెంబర్ 11, 12 తేదీల్లో గ్రాండ్ వెడ్డింగ్ జరగనున్నట్లు తెలిసింది.




## అక్కినేని ఇంట్లో హల్దీ వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్**

అక్కినేని నాగార్జున ఇంట పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. ఆయన పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం శోభితా ధూళిపాళ్లతో డిసెంబర్ 4న జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కాబోయే కొత్త జంటకు హల్దీ వేడుకలు నిర్వహించారు. చై-శోభిత జంటను ఒకేచోట ఉంచి మంగళస్నానాలు చేయించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకల్లో కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి